


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### శీలం వర్ణింపుము

**అసలు ఆరవ తరగతిలో** అడిగే ప్రశ్నేనా అంట. అశ్వత్థామ శీలం వర్ణింపుడూ? అదీ నాన్‌డీటైల్‌లో ప్రశ్న. అసలు నాన్‌డీటైల్ అంటేనే వివరంగా చెప్పరానిదీ, అడగరానిదీనూ... 80 పేజీల పుస్తకం మొత్తం ఒక్క ప్రశ్నకి జవాబుగా రాయించేద్దాం అని పాపం ఆశ. అయినా ఒకరి పర్సనల్ విషయాలు పట్టించుకునే అలవాటు లేదు నాకు. అశ్వద్ధామ శీలం గురించి నాకెందుకూ?

అసలు ఈ శీలం అనే మాటకి అర్థం సినిమాల్లో మాకు ఉగ్గులా తెలుగు చిన్నప్పుడే పట్టి నేర్పించారు. హీరోయిన్ "నాన్నా నేను తల్లిని కాబోతున్నాను" అని లైట్ ఆర్పి సింబాలిక్‌గా చెప్పగానే తండ్రి హఠాత్తుగా గుండెపోటు తెచ్చుకుని, గుండెని అరచేత్తో అదుముకుంటూ "పాపిష్టిదానా శీలం చెడ్డాక ఇంకా ఎందుకు బ్రతికున్నావే? నాకు గుక్కెడు విషం ఇచ్చి నువ్వు కూడా తాగకపోయావా?" అంటాడు.

ఇప్పుడైతే తెలుగు టీ.వీ సీరియల్స్‌లో `పాయిజన్` అని రాసిన సీసా గూట్లో పెట్టిస్తాం ప్రాపర్టీస్‌లో రాసి, ప్రొడక్షన్ వాళ్ళకి చెప్పి. ఆ రోజుల్లో మా చిన్నతనంలో పాపం అవి కొనలేకపోతే గన్నేరు పప్పునూరుకుని తినడమో, వజ్రం మింగడమో చేసేవారు హీరోయిన్లు. అప్పుడు తెలిసింది శీలం అంటే.

మా కుట్టు టీచర్ ఎప్పీబాతో "ఆ శీను గాడితో సమాధులచాటున కూర్చుంటున్నావు. శీలం చెడిపోతుంది జాగ్రత్త" అనడం విన్నాను. శీనుగాడు సినిమాలో విలన్‌లా కనిపించేవాడు నా కళ్ళకి. ఎనిమిదో క్లాసులో నున్నగా తలకి నూనె రాసుకుని, బాదం ఆకులా దువ్వుకుని వచ్చేవాడు, మధ్య పాపిడి తీసుకుని. కానీ పెద్దయ్యాక రాజనాల అవుతాడేమో, పలచని తెల్ల జుబ్బా, మెడలో పులిగోరూ, బుగ్గమీద గాటూ, మెడకి ఎర్ర రుమాలు కట్టుకుని, అందుకే ఇప్పటి నుండే శీలం పోగొడ్తున్నాడు అనుకున్నాను.

ఈ విషయం సాయంత్రం తెల్ల చిట్టి వరండా మీద మీటింగ్ పెట్టి, భవానీ మంజూ, వినోలియా, బుజ్జీ, చిట్టీలతో చెపుతూవుంటే మా వినోలియా "నిన్న సాయంత్రం పిండి గిర్నీ కెళ్ళి చీకట్లో వస్తుంటే, నా శీలం కూడా పోయిందేమో" అంది బాధగా.

అందరం తలలు తిప్పి దానికేసి సినిమాలో గుమ్మడిగార్లా చిత్తూరు నాగయ్యా గారిలా చూసేసాం. అది చెవిపోగు చూపిస్తూ "వదులుగా వుంది. పెట్టుకోవద్దు. అంది అమ్మ. అయినా నేనే పెట్టుకున్నాను. అమ్మకి తెలిస్తే చంపేస్తుంది" అంది. ఇంతలో సందానీగాడొచ్చి "ఎంది సంగతి?" అన్నాడు.

"విన్నూ శీలం పోయిందట పాపం" అంది బుజ్జి.

వాడు నెత్తికొట్టుకున్నాడు "ఇప్పుడు ఏడ్చి ఏం లాభం? ఆ చీకట్ల పిండి గిర్నీకి ఎందుకు పోయావు? " అని.

"పిండి గిర్నీ వాడేం చేసాడే?" అంది కుతూహలం ఎక్కువకల భవాని.

"ఛ. జారిపడిపోయింది. అతనేం చెయ్యలే" అని అది మళ్ళీ చెవి పోగు పట్టుకుని

"ఇది టైట్ వుంది. అది లూజ్ వుంది అంతేనే" అంది.

సందానీ సీరియస్‌గా "మళ్ళీ చెప్పు ఏం పోయింది?" అన్నాడు.

"శీలం పోయింది" అంది సీరియస్‌గానే.

"నీ బుద్ధి పిండి గిర్నీ కెళ్ళ అది శీల. శీలం కాదే" అని వాడు పడీ పడీ నవ్వాడు.

"అదేగా చెప్తున్నా" అని అది చెవి పోగులాగి, వెనక శీల లేదని చూపించింది.

"ఓసినీ ఇది సందానీ చెప్పినట్లు శీల. శీలం కాదు. శీలం అంటే మొన్న బాలాజీ టాకీస్‌లో సినిమాలో హీరోయిన్‌కి పోయింది చూడూ, అప్పుడు కట్టెలతో నిప్పు వేసుకుని పాట పాడాడు హీరో, హీరోయిన్‌తో. అదీ" అంది భవాని.

అప్పటిదాకా అర్ధం అయి అవనట్లున్న నేను "మరి తెలుగు పండిట్ నన్ను అశ్వద్ధామ శీలంగురించి రాయలేదని కొడ్తున్నాడెందుకే? వాడికెక్కడ పోయిందో నాకేం తెలుసూ?" అన్నాను చిరాగ్గా.

"అసలు ఆడపిల్లని అడగాల్సిన మాటేనా? మీ అమ్మమ్మకి చెప్పు, తెలుగు పండిట్‌కి ప్రైవేట్ తీసుకుంటుంది. నీకు వి.ఏ. శామ్యూల్ గాడు లవ్ లెటర్ ఇస్తే తీసుకున్నట్లు" అంది భవాని.

"ఆ వెంకటలక్ష్మి ఎడిషన్‌ల్ షీట్స్ తీసుకుని మరీ అశ్వద్ధామ శీలం గురించి ఎనిమిది పేజీలు బరబరా రాసేసిందే ఏం రాసిందో గానీ" అన్నాను బాధగా.

సందానీ సైకిల్ దిగి, మా మధ్యలో కూర్చుని ఆడవాళ్ళలో పెద్ద బావగారిలా, మాటలు మొదలెట్టాడు " వెంకట లస్కిమికి ఈ అశ్వద్ధామ బాగా తెలుసనుకుంట. వాళ్ళ ఇంటి దగ్గరే వుంటాడేమో?" అన్నాడు.

ఇంతలో మంజూ తలగోక్కుని "ఈ అశ్వద్ధామ అంటే నాన్‌డీటైల్‌లో వాడే వెంకటలక్ష్మి ఇంటి దగ్గర వుండడం ఏవిటి?" అంది.

"పంతులుగారి అశ్వద్ధ నారాయణ ఏమో అనుకున్నాను" అంది భవాని.

"అయినా మనకెందుకు? పెద్ద పెద్ద మాటలు మాట్లాడితే శీలం లాంటివి మా అమ్మమ్మ తౌడపాశం పెడ్తుంది" అన్నాను.

"అసలు హీరోయిన్స్ ఎందుకే సినిమాల్లో శీలం పోగొట్టుకుంటారు?" అంది బుజ్జి.

"వినీలియా లెక్కనా?" అడిగాడు సందానీ.

అది వాడి వీపు మీద రెండు అంటించి "ఆ శీలం వేరే నేను పోగొట్టుకున్న శీలం వేరే" అంది.

"నువ్వు 'ల' పక్కన 'సున్న' పెట్టుకు మరి" అని వాడు చిరాకు పడ్డాడు.

"హీరోయిన్‌కి శీలం పోతే వాళ్ళ నాన్న ఎందుకు గుండె పట్టుకోడం?" అడిగింది బుజ్జి, అందరం కాసేపు ఆలోచించాం.

"ఆ నాకు తెలిసింది. పాపం హీరోయిన్ శీలం పోగొట్టాలని రాజనాల వెంటపడితే, హీరో రక్షిద్దాం అని వచ్చాడు. ఈలోగా వాన పడింది. అందుకే ఆమెతో పాడు పడ్డ ఇంట్లోకి వెళ్ళాడు. అప్పుడు శీలం పోయింది" అంది భవాని.

"వానపడ్డప్పుడు హీరోతో వెళ్ళకుండా రాజనాలతో వెళ్ళినా శీలం వుండేదే ఏమో పాపం" అంది వినోలియా.

అందరం కాసేపు తర్జన భర్జనలు పడి  మరి విలన్ నుండి రక్షించి హీరో ఎందుకు శీలం పోగొట్టాడూ? అప్పుడు హీరో ఎలా అవుతాడూ? అనుకున్నాం

"ఏమైనా తెలుగు పండిట్ ఆ ప్రశ్న ఆడపిల్లలని అడగకూడదు. ఏమో ఆ అశ్వద్ధామ ఏం చేసాడో మనకేం తెలుసు?" అంది మంజు చిరాగ్గా.

"పుస్తకంలో మరి ఎంతో మంచివాడు అని రాసారుగా" అన్నాను.

సందానీ కయ్యిమన్నాడు "రేపు నా గురించి పుస్కం రాసినా నేను చాలా మంచివాడినీ, ఎవ్వరింట్ల బుగ్గలు పలగొట్టలే, గౌస్ దుకాన్‌ల బిళ్ళలు దొంగతనం సెయ్యలే. అనే పుస్కం ల రాస్తారు" అన్నాడు.

"నీ గురించి పుస్తకం రాస్తే అందులో కనీసం పది పేజీలు ఎ.వి.రమణి చాలా బావుండేది, చాలా మంచిది.. అని రాసేట్లు చూడరా?" అన్నాను గునుస్తూ.

"సూడు అది నా పుస్కం. నీ గురించి రాయరు. అది నేను పెద్దయినంక సిన్మ తీస్తే నేనే హీరో అందుల" అన్నాడు గర్వంగా.

"కాదు. నువ్వు కమేడియన్, రాజబాబులాగా, భాస్కర్ హీరోగా బావుంటాడు" అన్నాను. వాడికి కోపం వచ్చి, లేచి కాళ్ళు బాది "నా గురించి నాన్‌డీటైల్ రాసి, అది సినిమా తీస్తే, నేను హీరో కాకుండా, ఆ బాచిగాడెందుకు హీరో అవుతాడు?" అన్నాడు.

"మరి నేను హీరోయిన్ కదా! నాకు నచ్చినవాడే హీరో అవుతాడు" అన్నాను. ఆక్ ఈజ్ పాక్‌లాగా. వాడు బుర్రగోక్కున్నాడు.

"నువ్వు హీరోయిన్‌వి సరే, మరి నా కథలో నేనే హీరో కదా. బాచిగాడు ఎలా హీరో అవుతాడేం?" అన్నాడు.

"అదంతే నాకు బాచిగాడు బావుంటాడు" అని సుద్దతో అష్టాచెమ్మా గీయడం మొదలెట్టాను.

"అప్పుడు సందానీగాడి శీలం గురించి రాయమని ఎగ్జాంల అడిగితే ఏం రాస్తావ్?" అన్నాడు.

"వాడికి సైకిల్ లేదు, అరువు తీసుకుంటాడు, చెప్పులు కూడా అరువు తీసుకుంటాడు, శీలం కూడా లేదు భాస్కర్ దగ్గర అరువు తీసుకుంటాడు" అని గడగడా చెప్పాను.

అందరూ చప్పట్లు కొడ్తూ "సందానిగాడికి శీలం లేదూ. సందానిగాడికి సైకిల్ లేదూ" అని వాడి చుట్టూ చప్పట్లు కొడ్తూ అరుస్తూ తిరుగుతుంటే, వాడు గింజుకుని ఏడవడం మొదలెట్టాడు.

అసలు శీలం అంటే శరీరంలో లేదు. వస్తువూ కాదు పోడానికి. శీలం అంటే కేరెక్టర్. వ్యక్తిత్వం అని చెప్పే నాధుడే లేకపోయె ఆ వయసులో.

ఇప్పటికీ కొన్ని వార్తలు చదువుతుంటే, సినిమాలు చూస్తూంటే బలాత్కారం చేస్తే పోయేది ఆడపిల్ల శీలం కాదు. మనం ఎలాంటి సంఘంలో బతుకుతున్నామో..  ఆ సంఘం శీలం అని చెప్పాలనిపిస్తుంది.

Post your comments










https://www.youtube.com/watch?v=ERaaX_IulS4